క్లుప్తంగా

ముస్లిం దంపతులకు అభినందన



అభినందిస్తూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

కాగజ్‌నగర్‌రూరల్: కులమతాలకతీతంగా జరిగే వినాయక చవితి ఉత్సవాల్లో ఓ ముస్లిం దంపతులు వేలం పాటలో లడ్డూ దక్కించుకున్నారు. మండలంలోని భట్‌పల్లి పంచాయతీ గణేశ్ మండలి వద్ద అదే గ్రామానికి చెందిన అఫ్జల్ ముస్కాన్‌లు లడ్డూ గెలుచుకోగా, వారిని అభినందిస్తూ మాజీమంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. శాంతియుత, సామరస్యపూర్వక తెలంగాణ భవిష్యత్తు కోసం ప్రార్థించండి, అసలైన తెలంగాణ సంస్కృతి ఇదే అంటూ ట్వీట్ చేశారు.

రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

రెబ్బెన: రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆటో, ప్రైవేటుమోటర్స్ ఫెడరేషన్‌గా ఏర్పడి పోరాటం చేస్తుందన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో ఆటో, క్యాబ్ ప్రైవేటు మోటారు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాలక్ష్మి ద్వారా నష్టపోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని, వారికి ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు నర్సింగరావు, రాజాగౌడ్, వెంకన్నగౌడ్, స్వామి, నందు, నగేశ్, గణేశ్, దేవయ్య, రాజ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం

ఆసిఫాబాద్‌రూరల్: పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ అధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా రవి, అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యనారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలిగా అనుసూర్య కార్యదర్శిగా వాసంత్ రావు ఎన్నికయ్యారు.

ప్రజలకు సేవచేయడమే లక్ష్యం

పెంచికల్‌పేట్: గెలుపోటములతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారికి సేవ చేయడమే తన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఎల్లూర్ గ్రామానికి చెందిన హుస్సేన్ అనారోగ్యంతో బాధపడుతుండగా మంగళవారం పరామర్శించారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు సాజీద్, మాజీ సర్పంచులు శ్రీనివాస్, సంజీవ్, చౌదరి తిరుపతి, ఇలియాస్, ఖైరాత్, బాబా ఉన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

ఆసిఫాబాద్‌రూరల్: నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తుంపెల్లి పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలను నాటారు. కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి



గాయాలపాలైన నగేష్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పెద్దవాగులో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. క్రేన్ సాయంతో వినాయకుడిని ఎక్కించే క్రమంలో టైరు కిందపడి ఇద్దరు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు గాయాలయ్యాయి. కార్మికుడు నగేష్ రెండు కాళ్లకు తీవ్రగాయాలు కాగా మరో కార్మికుడు ప్రేంకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరిశీలించారు.

రెపరెపలాడిన జాతీయజెండాలు



పెంచికల్‌పేట్: జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్



చింతలమానెపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో కోట ప్రసాద్



దహెగాం ఎంపీడీవో కార్యాలయంలో..



రెబ్బెన: జాతీయ జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్

- ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద జాతీయ జెండాలు రెపరెపలాడాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

దహెగాం: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్, పోలీసుస్టేషన్‌లో ఎస్సై రాజు, ఐకేపీలో ఏపీఎం చంద్రశేఖర్, గ్రామ పంచాయతీలో ప్రత్యేకాధికారి రాజేందర్, పీహెచ్‌సీలో వైద్యాధికారి అశ్విని, కేజీబీవీలో ఎస్‌వో రిజ్వాన, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడు దౌలత్, జాతీయ జెండాలను ఎగురవేశారు.

చింతలమానెపల్లి: ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్ వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. డిప్యూటీ తహసీల్దార్ మషూకర్ అలీ, ఎంపీడీఓ కోట ప్రసాద్, ఎస్సై ఇస్లావత్ నరేశ్, అధికారులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ పతకాలను ఎగురవేశారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి డీపీవో భిక్షపతి, ఎస్సై చంద్రశేఖర్, డాక్టర్ సందీప్, పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్ జాతీయ జెండాలను ఎగురవేశారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నాయకులను స్మరించుకున్నారు. ఎంపీడీవో శంకరమ్మ, సూపరింటెండెంట్ వాసుదేవ్, ఆర్ఐ ప్రేంకిరణ్ ఉన్నారు.

పెంచికల్‌పేట్: ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో కార్యాలయంలో అల్బర్ట్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కొమురయ్య, అటవీ కార్యాలయంలో ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్, పీహెచ్‌సీలో డా. ఆర్షిన్, ఎమ్మార్సీలో ఎంఈవో రమేశ్‌బాబు, రైతు వేదికలో ఏఈవో శ్రీవిద్య, పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

కౌటాల: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కోటప్రసాద్, తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పుష్పలత, పీఏసీఎస్‌లో చైర్మన్ కుమురం మాంతయ్య త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, పశువైద్యశాలలో డాక్టర్ శ్రీకాంత్ జాతీయ జెండాను ఎగురవేశారు.

ఆసిఫాబాద్‌రూరల్: అన్ని పంచాయతీల్లో జాతీయజెండాలను ఆవిష్కరించారు.



దహెగాం: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్



రెబ్బెన: జాతీయ జెండాకు వందనం చేస్తున్న డీపీవో భిక్షపతి



కౌటాల: జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ పుష్పలత

ఆక్రమణలపై ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ కౌన్సిలర్

కాగజ్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 8వ వార్డులో దోబీఘాట్ ఆక్రమణకు గురైందని, విశాలంగా ఉన్న దోబీఘాట్‌ను కొందరు బోగస్ పత్రాలు సృష్టించి అధికారుల అండదండలతో ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. కోట్ల రూపాయల విలువైన ఈ దోబీఘాట్‌లో పెద్ద షెడ్ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. సర్‌సిల్క్‌లోని డంపుయార్డు సైతం కబ్జాకు గురైందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ ఓపెనింగ్ మేళా



మాట్లాడుతున్న ఎస్‌వో టూ జీఎం రాజమల్లు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల సీఈఆర్ క్లబ్‌లో కాంట్రాక్టు ఉద్యోగుల కోసం మంగళవారం హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ ఓపెనింగ్ మేళా నిర్వహించారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు ఈ మేళాను ప్రారంభించి మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సింగరేణి యాజమాన్యం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అకౌంట్ ఉన్న కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.30 లక్షల బీమా సౌకర్యంతోపాటు తదితర ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ప్రతి కాంట్రాక్టు ఉద్యోగి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా తెరవాలని సూచించారు. పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, బ్యాంకు ప్రతినిధి ప్రవీణ్ పాల్గొన్నారు.

భారం.. మేదరి జీవనం..!

అడవికి వెళ్లి కంకబొంగులు తెచ్చి వాటిని నిలువునా చీల్చి.. ఎండకు ఆరబెట్టి ఓపికతో అల్లి మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మితే వచ్చే డబ్బులతో జీవనం సాగించే మేదరులకు ఉపాధి లేకుండా పోతోంది. ప్లాస్టిక్ దెబ్బకు వెదురు తట్టలు, బుట్టలకు ఆదరణ తగ్గిపోతుండడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బుధవారం 'ప్రపంచ వెదురు దినోత్సవం'సందర్భంగా ప్రత్యేక కథనం.

- లభ్యం కాని ముడిసరుకు
- తట్ట, బుట్టలకు తగ్గిన ఆదరణ
- కుటుంబ పోషణకు ఇబ్బంది



బుట్టలు అల్లుతున్న మేదరులు

కౌటాల: కుమురం భీం జిల్లాలో 310 మేదరి కుటుంబాలు ఉన్నాయి. వాటిలో 285 కుటుంబాలు వెదురుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. కుటుంబమంతా కష్టపడితే కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఖర్చులు పోను పిల్లల చదువులు, ఇతర అవవసరాలకు సంపాదన సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అడవి నుంచి వెదురు తీసుకెళ్లకుండా అడ్డుకుంటుండడంతో చేతినిండా పని దొరకక పస్తులుండాల్సిన పరిస్థితి. దీంతో చాలా మంది కులవృత్తికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

కరువైన ఉపాధి..

మేదరులు వెదురుతో తడకలు, బుట్టలు, గొర్ల తడకలు, చాటలు, గంపలు, పెళ్లి పందిళ్లు, మొక్కల పెంపకానికి చిన్న చిన్న బుట్టలు, నిచ్చెనలు, పూల తొట్టీలు, విసనకర్రలు, పొయ్యి గొట్టాలు, ఆట వస్తువులు, తరాజు, బుట్టలు, ధాన్యం నిల్వ చేసే గుమ్ములు అల్లుతారు. వాటిని తెల్లవారుజామునే పల్లెల్లో తిరుగుతూ విక్రయించి వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటారు. గతంలో అడవులు ఎక్కువగా విరివిగా లభించేవి. కాలక్రమేణా అడవులు అంతరిస్తుండంతో అధికారులు కంకబొంగును అడవి నుంచి తీసుకెళ్లనీయడం లేదు. అంతేకాకుండా ప్రస్తుతం ప్లాస్టిక్ వస్తువులు లభిస్తుండడంతో మేదరులకు ఉపాధి కరువవుతోంది.

అడవే మాకు ఆధారం



వెదురును నమ్ముకుని జీవిస్తున్న మాకు అడవే ఆధారం. అడవిలో దొరికే వెదురు బొంగులతో వివిధ రకాల వస్తువులు తయారు చేసి విక్రయిస్తాం. ప్రస్తుతం అడవిలో కంకబొంగు లభించక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు అడవుల్లో వెదురు మొక్కలను నాటాలి. వెదురు తెచ్చుకునేందుకు ప్రభుత్వం ఆంక్షలు విధించొద్దు.

– ఆర్.ప్రకాశ్, గురుదుపేట, కౌటాల

మేదరులను ఆదుకోవాలి



ప్రభుత్వం మేదరుల అభివృద్ధికి పథకాలు ప్రవేశపెట్టాలి. వెదురు ఉచితంగా సరఫరా చేయాలి. ప్రభుత్వం వారికి రుణాలు అందించాలి. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి వెదురు వస్తువుల పై అవగాహన కల్పించాలి.

– సుల్వ కనకయ్య, మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆసిఫాబాద్

బైబై గణేశా

- ఘనంగా గణేశ్ నిమజ్జనం



సిర్పూర్(టి): నిమజ్జనోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

ఆసిఫాబాద్‌అర్బన్: గణేశ్ నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిదిరోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లాయి. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథస్వామి ఆలయంలో సార్వజనిక్ గణేశ్ మండలి వద్ద ఏర్పాటు చేసిన గణనాథున్ని మంగళవారం స్థానిక పెద్దవాగులో నిమజ్జనం చేశారు. అంతకుముందు అర్చకుడు నరేశ్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మెడలోని హారాన్ని నిర్వాహకులు వేలం వేయగా రూ. 10,200కు సందీప్, ప్రశాంత్, సుగుణాకర్‌లు కైవసం చేసుకోగా, లడ్డూ ప్రసాదాన్ని రూ.9.700 వైరాగడే రమేష్ దక్కించుకున్నారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర రావులవాడ, పొట్టిశ్రీరాములుచౌక్, గాంధీచౌక్, కంచుకోట మీదుగా పెద్దవాగు వరకు బ్యాండ్‌మేళాలతో నిర్వహించారు. యువకుల నృత్యాలు, మహిళలు దాండియా ఆటలతో ఉత్సాహంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కౌటాల: మండలంలోని గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. గంగమ్మ ఒడిలోకి వదిలి వీడ్కోలు పలికారు. దీంతో గ్రామాల్లో భక్తుల సందడి నెలకొంది.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ పంచాయతీతోపాటు గ్రామాల్లో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర ర్యాలీలు నిర్వహించి చెరువల్లో నిమజ్జనం చేశారు. ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



కౌటాల: కేజీబీవీ హాస్టల్‌లో..



కౌటాల: ముత్తంపేట్ గణేశ్ విగ్రహానికి పూజలు చేస్తూ..



నృత్యం చేస్తున్న యువకులు

అదృశ్యమైన బాలుడు.. ఆచూకీ లభ్యం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని రాజీవ్ నగర్‌కు చెందిన బాలుడు (12) మంగళవారం అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బాలుడు ఉదయం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లగా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి ఫొటో సహా వివరాలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. చివరకు బాలుడు..ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లాడు. అక్కడ నారాయణగూడ పోలీసులు తనిఖీ చేయగా బాలుడి కనిపించాడు. వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులు, బంధువులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకోగా పోలీసులు బాలుడిని అప్పగించారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రధాని మోదీ జన్మదినవేడుకలను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్‌సిల్క్‌కాలనీలోని ఎమ్మెల్యే హరీశ్‌బాబు తన నివాసంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెడుతున్నారని అన్నారు. అక్టోబర్ 2 వరకు జరిగే సేవా పక్వాడా కార్యక్రమంలో పలు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, జిల్లా కార్యదర్శి అరుణ్‌లోయా, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, దెబ్బటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మనోహర్‌గౌడ్, శంకర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి, రాణి, మోహిని తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు మురళి, కిరణ్, ఖాండ్రె విశాల్, లక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజ్, సత్తన్న, ప్రసాద్‌గౌడ్, వేణు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని బాలాజీనగర్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌బాబు విశ్వకర్మ పతాకావిష్కరణ చేశారు. అనంతరం విశ్వకర్మ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సహకరిస్తామన్నారు. ప్రధానమంత్రి జన్మదినం సందర్భంగా పూజలు చేశారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..

రెబ్బెన: మండల కేంద్రంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. లోకేశ్ నాయుడు, వేణు గోపాల్, గందే నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బాబాపూర్ హనుమాన్ ఆలయంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు.అర్చకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రామాలయంలో విశ్వకర్మ చిత్రపటం వద్ద అర్చకుడు విష్ణుతేజ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

గణేశ్ మండపం వద్ద లక్ష్మీగణపతి హోమం



హోమంలో పాల్గొన్న జంటలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేటలోని సాయినివాడలో నెలకొల్పిన శివసాయి గణేశ్ మండపం వద్ద నిర్వాహకులు మంగళవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అర్చకుడు మహేశ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన హోమం కార్యక్రమంలో 13 జంటలు పాల్గొన్నాయి. అంతకుముందు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.